ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా
- నాగరాజుపేట యూపీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభం


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ ప్రెస్‌క్లబ్ వెనుక ఉన్న యూపీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన మేయర్ సురేష్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తాను కూడా స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను సందర్శించి, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ పేదలు నివసిస్తున్న ప్రతి గడపకు ఉచిత వైద్యాన్ని దగ్గరికి చేర్చడమే «జగనన్న ఆరోగ్య సురక్ష» ముఖ్య ఉద్దేశ్యమన్నారు. 45 రోజుల పాటు ఈ కార్యక్రమం ప్రతి పీహెచ్‌సీ పరిధిలో జరుగుతుందని తెలిపారు. పదిహేను రోజులుగా వాలంటీర్లు, గృహ సారథులు, ఆశాలు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహించారని, పెద్ద జబ్బులు ఉన్నవారికి మెరుగైన వైద్యం కోసం పెద్ద హాస్పిటల్స్‌కు ఇక్కడి నుంచే రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. బీపీ, షుగర్, బ్లడ్, యూరిన్ వంటి 11 రకాల పరీక్షలను స్థానికంగా నిర్వహించి 15-20 నిముషాల్లోనే రిపోర్టులు, మందులు ఉచితంగా అందివ్వడం జరుగుతుందన్నారు. ఇందుకోసం గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, ఆప్తాల్మాలజీ, జనరల్ మెడిసిన్‌కు సంబంధించిన వైద్యులను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. సాయంత్రం వరకూ ఈ శిబిరం కొనసాగుతుందని, ప్రజలు ఓపికగా ఉండి పరీక్షలు చేయించుకొని మందులు తీసుకొని వెళ్లాలని సూచించారు.

– మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ గత పాలకుల వల్ల అనారోగ్యశ్రీగా మారిన ఆరోగ్యశ్రీ పథకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జవసత్వాలు పోశారని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో 51వేల ఖాళీలను భర్తీ చేసి, ఆరోగ్యశ్రీ పథకంలో 6500లకు పైగా వ్యాధులను చేర్చారన్నారు. రూ.1000లు దాటితే ఆరోగ్యశ్రీ ద్వా రా ఉచిత వైద్యం అందిస్తున్నారని, 108,104 వాహనాలకు డీజిల్‌కు కూడా ఇవ్వని పరిస్థితి గతంలో ఉంటే, ఈ ప్రభుత్వం కొత్తగా 1000 అంబులెన్స్‌లు కొని, మండలానికి ఒకటి కేటాయించిందన్నారు.

– కార్యక్రమంలో కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్, తహసీల్దార్ శివరామిరెడ్డి, ఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, కార్పొరేటర్లు మల్లికార్జున, రిజ్వాన్, నాయకులు అఫ్జల్‌ఖాన్, ఐస్‌క్రీం రవి, సుబ్బారెడ్డి, తోట క్రిష్ణ, కిరణ్, రామక్రిష్ణారెడ్డి, డిష్ జిలాన్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వాలు వైద్యాన్ని నిర్లక్ష్యం చేశాయి

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

గతంలో రాష్ట్రాన్ని పాలించిన ప్రభుత్వాలన్నీ వైద్యాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశాయని కమలాపురం శాసన సభ్యులు రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. శనివారం ప్రెస్‌క్లబ్ వెనుక ఉన్న నాగరాజుపేట యూపీహెచ్‌సీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి, ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య వచ్చినా వారి ఇంటి వద్దకే వెళ్లి పరిష్కరించాలనేది ముఖ్యమంత్రి ఉద్దేశ్యమన్నారు. అందులో భాగంగానే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకోవడం జరిగిందని, జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ధ్రువీకరణ పత్రాలను ఇళ్ల వద్దకే వెళ్లి అందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తున్నామని తెలిపారు.

– ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్, త్యాగరాజు, రామచంద్ర పాల్గొన్నారు.


ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

క్లుప్తంగా

3న నిరసన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈనెల 3న హెడ్ పోస్ట్ ఆఫీస్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్‌ల ముందు కేంద్ర కమిటీ వామపక్ష రైతు కార్మిక సంఘాల పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నామని.. జయప్రదం చేయాలని వామపక్ష రైతు కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, మనోహర్ కోరారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. లకింపూర్‌లో రైతులపై కాల్పుల ఘటనకు బాధ్యుడైన మంత్రిని బర్తరఫ్ చేయనందుకు నిరసనగా దేశవ్యాప్తంగా బ్లాక్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరిరెడ్డి, ఎంవి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను మంచికి వినియోగించాలి

వైవీయూ: సాంకేతికతను మంచి కోసం వినియోగించాలే తప్ప చెడుకోసం కాదని వైవీయూ మనోవిజ్ఞానశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె. లలిత పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, జేఎంజే జూనియర్ కళాశాలల్లో స్టెప్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం – కెరీర్ గైడెన్స్ అన్న అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డా. లలిత మాట్లాడుతూ విద్యార్థులు కెరీర్‌గైడెన్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత పలు సూచనలు ఇచ్చారు. స్టెప్ మేనేజర్ సుబ్బారాయుడు, జేఎంజే జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రోజ్‌రాణి, స్టెప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఐ పరీక్షలకు గడువును పొడిగించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్/ కడప ఎడ్యుకేషన్: ఎస్‌ఐ మెయిన్స్ పరీక్షలకు మూడు నెలల సమయం ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. శనివారం డిప్యూటీ సీఎం కార్యాలయంలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషాకు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, ఓబులేసు పాల్గొన్నారు.

ఎస్‌ఐ మెయిన్స్ పరీక్షలకు సన్నద్ధం కావడానికి గడువును పెంచాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బి. దస్తగిరి డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చైతన్య, నగర నాయకులు సంజీవ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాల విద్యార్థులకు 26 పతకాలు


పతకాలు సాధించిన క్రీడాకారులతో స్పెషలాఫీసర్, కోచ్‌లు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాల అథ్లెటిక్స్ క్రీడాకారులు పతకాల పంట పండించారు. గత నెల 20 నుంచి 23వ తేదీ వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటారు. 7 స్వర్ణపతకాలు, 12 రజత , 7 కాంస్య పతకాలు సాధించారు. దీంతో పాటు తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా హనుమకొండలో అక్టోబర్ 14 నుంచి 17 వరకు నిర్వహించనున్న సౌత్‌జోన్ నేషనల్ అథ్లెటిక్స్‌లో పాల్గొనే ఏపీ జట్టుకు 15 మంది క్రీడాకారులు ఎంపికవడం విశేషం. ఈ సందర్భంగా వైఎస్ఆర్ క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి కె. జగన్నాథరెడ్డి క్రీడాకారులను, అథ్లెటిక్స్ శిక్షకులు కె. వంశీధర్, పి. వెంకటేశ్వరరావులను అభినందించారు.

నిరసనలకు బలిజల మద్దతు లేదు

కడప కల్చరల్ : టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు పట్ల ఆ పార్టీ చేస్తున్న నిరసనలకు బలిజ కులస్తుల మద్దతు లేదని గ్రేటర్ రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షులు చెన్నంశెట్టి మురళీకృష్ణ స్పష్టం చేశారు. కడప లోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినీతి ఆరోపణల మీద అరెస్ట్ అయిన చంద్రబాబుకు మద్దతు ఇస్తే అవినీతిని ప్రోత్సహించినట్లేనన్న తప్పుడు సంకేతాలు ప్రజల్లో వెళతాయన్నారు. బలిజలు అన్ని పార్టీల్లో ఉన్నారని, ఆదివారం కడప నగరంలో టీడీపీ తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలకు బలిజ కులస్తులు అందరూ రావాలని కొంతమంది పిలవడం సమంజసం కాదన్నారు.

స్వార్థ రాజకీయాలకు వాడుకోవద్దు

కడప కార్పొరేషన్: బలిజ, కాపు కులస్తులను స్వార్థ రాజకీయాలకు వాడుకోవడం తగదని వైఎస్సార్‌సీపీ క్లస్టర్-4 అధ్యక్షుడు, బలిజ సంఘం నాయకుడు తోటక్రిష్ణాంజనేయులు అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్కిల్ డెవెలప్‌మెంట్ స్కాంలో ఆధారాలతో అడ్డంగా దొరికిపోయిన ప్రతిపక్షనేత చంద్రబాబుకు మద్దతుగా కడప నగరానికి చెందిన టీడీపీ నాయకులు బలిజ, కాపు సంఘం పేరు చెబుతూ జన సమీకరణ యత్నం చేయడం సరికాదన్నారు. కుల సంఘం పెద్దలను, ప్రతినిధులు, కులస్తులను సంఘం అభివృద్ధికి ఉపయోగించుకోవాలే తప్పా తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవడం మంచిపద్ధతి కాదన్నారు.

వైఎస్సార్ సీపీ డాక్టర్ల విభాగం నగర కమిటీ నియామకం

కడప కార్పొరేషన్ : కడప నగర డాక్టర్ కమిటీ అధ్యక్షులుగా పుత్తా సతీష్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎంవీ పవన్‌కుమార్‌రెడ్డి, అరుణజ్యోతి, ప్రధాన కార్యదర్శులుగా సుమన్, ఎస్. జబీర్, వెంకట నారాయణ, ఎం.మురళీకృష్ణ, ఆర్.నాగసురేంద్ర, ఎస్. శివశంకర్, సెక్రటరీలుగా డి.సుబ్బరాయుడు, ఎస్. ఆనంద్, పవన్ కుమార్, జి.విజయశ్రీ, షేక్ రియాజ్ అలీ, ఎ.అరుణకుమారి, పి.ప్రసన్నలక్ష్మి, ఎస్.ఓబుల్‌రెడ్డి, డి.విష్ణుకుమార్, పి.ఇర్షాద్ అహ్మద్, డి.సుధారాణి, జి.ఉష, జాయింట్ సెక్రటరీలుగా సునీల్‌కుమార్, ఇ.మోహన్, జి.ప్రవీణ్, ఎం.ఫసీర్ అహ్మద్, పి.నాగచరణ్, కె.నారాయణ, ఆర్.దేవేంద్ర, పి.సుధీర్, ఐజే రాజేష్, పి.సుధీర్‌కుమార్, పి.శ్యాంకుమార్, పీఎం గణేష్‌రెడ్డిలను నియమించారు.

మట్కా బీటర్ అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్వారకానగర్‌లో శనివారం మట్కా రాస్తున్న కొమ్మిశెట్టి సుబ్బరాయుడు అనే వ్యక్తిని సీఐ ఎన్.వి నాగరాజు ఆధ్వర్యంలో ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.3000 నగదుతో పాటు మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

నేడు అవార్డులు

కడప కల్చరల్ : కడప నగరం బెల్లంమండివీధి లోగల మదరసా-యే-జహారాలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఆలిండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మిలాద్ నబీ ఉత్సవాల్లో భాగంగా జరగనున్న ఈ కార్యక్రమానికి సంస్థ జిల్లా అధ్యక్షులు ఎస్.నజీర్‌బాష అధ్యక్షత వహించనుండగా, డిప్యూటీ సీఎం అంజద్‌బాష ముఖ్య అతిథిగా హాజరవుతారు.

వైద్య శిబిరం

వైవీయూ : విద్యార్థులు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప శ్రీహరి డిగ్రీ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, శాంతిగిరి ఆయుర్వేద సిద్ధవైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ జి. సుబ్బారెడ్డి మాట్లాడారు. వైద్యులు అనంతు ప్రహ్లాదన్, ఆదర్శ్ అజయ్, సంస్థ మేనేజర్ మనీష్ మోహనన్, పుష్పలత పర్యవేక్షణలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పూర్వ అధ్యక్షులు డా. రంగనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవిత్రయమే తెలుగు అనువాదానికి ఆద్యులు

కడప కల్చరల్ : సంస్కృతంలోని మహాభారతాన్ని తెలుగులోకి అనువదించిన నన్నయ, తిక్కన, ఎర్రనలు తెలుగు సాహిత్య చరిత్రలో అనువాద ప్రక్రియకు ఆద్యులని వైవీయూ పాలకమడలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శనివారం అంతర్జాతీయ అనువాద దినోత్సవం సందర్భంగా చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి , బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, మరో సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడారు. సాహితీవేత్తలు కందిమల్ల రాజారెడ్డి, కొత్తపల్లి రామాంజనేయులు కూడా మాట్లాడారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి

కడప ఎడ్యుకేషన్: యువత రక్తదానం చేసి రక్తదాతలు కావాలని డిప్యూటీ సీఎం అంజాద్ బాష పిలుపునిచ్చారు. అక్టోబర్ 1వ తేదీ నేషనల్ వాలంటీర్ బ్లడ్ డొనేషన్ డేని పురస్కరించుకుని రాయల్ రషీద్ అసోసియేషన్ తయారు చేసిన పోస్టర్స్‌ను శనివారం కడపలోని డిప్యూటీ సీఎం అంజాద్‌బాష తమ కార్యాలయంలో విడుదల చేశారు.

'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' జయప్రదం చేయాలి

- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' అనే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులంతా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం పక్కనున్న డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్లేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్ 11 నుంచి నవంబర్ 11 వరకూ నెల రోజుల పాటు సచివాలయాల సందర్శన ద్వారా సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ, వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం, గ్రామ, వార్డు పెద్దలతో డిన్నర్, రాత్రి బస వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు యానాదయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

ఇది పేదల మేలు కోరే ప్రభుత్వం

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల మేలును మాత్రమే కోరుకుంటుందని ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా అన్నారు. శనివారం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా.. 46 వ డివిజన్ శాస్త్రి నగర్, దర్గా మిట్ట ప్రాంతాల్లో పలు వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో సీఎం సంతకం చేసిన బుక్ లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పి. అయేషా అనే మహిళ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అమ్మ ఒడి, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.9.05లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. షేక్ బషీరూన్ అనే మహిళ మాట్లాడుతూ తనకు వైఎస్ఆర్ ఆసరా, జగనన్న అమ్మ ఒడి, వైఎస్ఆర్ పింఛన్ కానుక, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.8,76,000 లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, 46వ డివిజన్ కార్పొరేటర్ ఎం.వెంకటగిరి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, బంగారు నాగ య్య, రామ్మోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రహీం, పస్తం అంజి, షఫీవుల్లా, టీపీ వెంకట సుబ్బమ్మ, మూలే సరస్వతి, రత్నకుమారి, బండి మరియలు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపుపై సమీక్ష

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాబోయే సాధారణ ఎన్నికలకు సంబంధించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపుపై సమావేశం నిర్వహించామని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం తన కార్యాలయంలో కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో కడప నగరంలోని అన్ని పోలీసుస్టేషన్ల సీఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపుపై ఎన్నికల కమిషన్ సూచనల మేరకు సవివరంగా వివరించామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తయారు చేసిన పోలింగ్ కేంద్రాల జాబితాను పోలీసు వారికి అందజేసి తదుపరి లా అండ్ ఆర్డర్ ప్రకారం ముసాయిదా జాబితాను తయారు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కడప తహసీల్దార్ శివరామిరెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డి, నగరంలోని సీఐలు నరసింహారెడ్డి, రాజా, నాగరాజు, హాసం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

బ్లడ్ గ్రూపు నిర్ధారణ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం వైద్య సిబ్బంది విద్యార్థులకు బ్లడ్ గ్రూపు నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్ పాల్గొన్నారు.

శోభారాణికి డాక్టరేట్

వైవీయూ : వైవీయూ తెలుగుశాఖ పరిశోధకురాలు ముదిరెడ్డి శోభారాణికి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. రెండు దశాబ్దాల రాయలసీమ కథాసాహిత్యం – గ్రామీణ జీవితం అన్న అంశంపై ఈమె చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ఇచ్చారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప పార్లమెంటు పరిధిలో కడప డిపోలో లైట్ మోటారు వెహికల్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూలును నిర్వహిస్తున్నామని, డ్రైవర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం కడప ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో 17వ బ్యాచ్ శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల అనుభవం కలిగిన ఇన్‌స్ట్రక్టర్లచే శిక్షణ ఇస్తున్నామన్నారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్ఎం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు గంటపాటు వివిధ భాగాల పనితీరు గురించి, పెయింటింగ్ మార్కుల గురించి, రోడ్డు ప్రక్కనగల సిగ్నల్ బోర్డుల గురించి సవివరంగా తెలియజేస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు 9959225774 సంప్రదించాలన్నారు.

బోధనేతర సిబ్బందిని నియమించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న గోరుముద్ద, అమ్మ ఒడి, విద్యాకానుక, నాడు– నేడు మొదలైన పనులను ఆన్‌లైన్ చేయుటకు ప్రభుత్వం బోధనేతర సిబ్బందిని నియమించాలని ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జీవీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప ఎస్టీయూ భవన్‌లో హెచ్‌ఎం సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి అధ్యక్షతన జోనల్‌స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, శ్రీనివాసరావుతోపాటు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జీవీ నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశానికి కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జీవీ నారాయణరెడ్డి మాట్లాడుతూ అందరూ సంఘటితంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. వాటిని క్షేత్రస్థాయిలో అమలు జరుపుతున్న హెచ్ఎంల ఇబ్బందులను గుర్తించాలన్నారు. హెచ్ఎం సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, నారాయణ, రమేష్, లింగన్న, శివరామయ్య, మల్లికార్జున, చంద్రశేఖర్, రాయలసీమ జోన్ పరిధిలోని కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీవీ నారాయణరెడ్డి

కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు


విద్యార్థులతో గౌస్‌లాజం

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం సర్కార్ బడులను కార్పొరేట్‌గా దీటుగా తీర్చిదిద్దిందని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజం అన్నారు. శనివారం కడప శివార్లలోని బిస్మిల్లా నగర్ నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు.

నేటి నుంచి సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు

– కడప డీఎస్పీ ఎండీ షరీఫ్

కడప అర్బన్: కడప పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో అక్టోబర్ 1 నుంచి 31వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్‌యాక్ట్ అమలులో వుంటుందని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలను చేపట్టాలంటే 24 గంటల ముందు లిఖిత పూర్వకంగా పోలీసు వారికి అర్జీ ఇచ్చి వారి నుంచి ముందస్తు అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో జిల్లా దేవదాయశాఖ ఈఓ పి.సురేష్‌కుమార్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మహేష్, కడప నగర దేవాలయాల సమూహం ఈఓ ఎ.శ్రీధర్, ప్రధాన అర్చకులు గోపాలకృష్ణ, అర్చకులు రఘువీర్‌శర్మ, ఆలయ సిబ్బంది, భక్తుల సమక్షంలో లెక్కింపు నిర్వహించారు. ఏడు నెలల ఏడు రోజులకు రూ. 1,33,279 హుండీల ద్వారా సమకూరినట్లు ఈఓ వివరించారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించడం తగదని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. జీపీఎస్ వల్ల ఉద్యోగులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగరాజు, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఖాదర్‌బాష, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామం అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డి.శ్యాంసుందర్‌రెడ్డి

కడప కల్చరల్ : కడప శిల్పారామం అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర శిల్పారామాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి.శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కడప శిల్పారామారాన్ని సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. నీటి ఫౌంటెన్ చుట్టూ రంగురంగుల విద్యుత్ దీపాలను అమర్చాలన్నారు. ప్రత్యేకంగా స్టాల్స్ షెల్టర్లను ఏర్పాటు చేయాలని, ఫోటో షూటింగ్‌లకు అనువుగా శిల్పారామంలో కొద్దిభాగాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. మెయిన్ గేట్ ముందుభాగంలో డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

కడప అగ్రికల్చర్: చీని, నిమ్మతోటల సస్యరక్షణతో అధిక దిగుబడులను సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ మానస అన్నారు. శనివారం సికెదిన్నె మండల రైతు భరోసా కేంద్రంలో ఉద్యానాధికారి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో చీని, నిమ్మ తోటల సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మానస, ఉద్యానాధికారి జ్యోతిర్మయి పలు సూచనలు ఇచ్చారు. శిక్షణ అనంతరం రైతుల తోటలకు వెళ్లి తెగుళ్లను పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు.

గానుగపెంటకు సత్కారం


గానుగపెంటను సత్కరిస్తున్న బీసీ నాయకులు

కడప కల్చరల్ : జిల్లాకు చెందిన కవయిత్రిగా మొల్లమాంబ ప్రతిభా పాండిత్యాలను తెలుగునాట విశేషంగా ప్రచారం చేసి ఆమె ఖ్యాతిని ఇనుమడింపజేసిన గానుగపెంట హనుమంతరావు కృషి ప్రశంసనీయమని వైవీయూ పాలక మండలి సభ్యులు మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సాహితీవేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావుకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మూల మాట్లాడుతూ మొల్లమాంబ పేరును నేటి తరానికి పరిచయం చేసి ఆమె జయంతిని ప్రభుత్వమే నిర్వహించేలా గానుగపెంట చేసిన కృషి గొప్పదని కొనియాడారు. అనంతరం గానుగపెంటను పలువురు సాహితీవేత్తలు, మొల్లమాంబ అభిమానులు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు లింగమూర్తి, గోవిందు నాగరాజు, పెన్షనర్స్ సంఘం నాయకులు ఎం రామమూర్తి నాయుడు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.